www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 13 డిసెంబర్ 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

సూర్యనారాయణశర్మకు డాక్టరేట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణానికి చెందిన పెండ్యాల సూర్యనారాయణ శర్మకు తిరుపతి మహతి ఆడిటోరియంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. బెంగళూరుకు చెందిన ఎస్‌వివి యూనివర్సిటీలో మెడికల్ అస్ట్రాల జీలో ఆయన పిహెచ్‌డి పూర్తి చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్‌తో పాటు జ్యోతిష్య ఆచార్య పురస్కారం అందించారని ఆయన తెలిపారు. పలువురు పట్టణ ప్రముఖులు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.



డాక్టరేట్ అందుకున్న పెండ్యాల

తప్పని ఇసుక అవస్థలు

- తెరవని ర్యాంప్‌లు
- ప్రజలకు అందని ఇసుక
- ఇతర జిల్లాల నుంచి దిగుమతి
- నిలిచిపోయిన నిర్మాణాలు

ప్రజాశక్తి-రాజోలు

కూటమి ప్రభుత్వంలోను ఇసుక కష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత పాలసీని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పి ఎన్నికల్లో ప్రకటించారు. అయితే అమలులో సాధ్యం కావడం లేదు. రాజోలు నియోజకవర్గంలో బోట్స్‌మేన్ సొసైటీల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు జరిగేవి. ప్రస్తుతం ఎక్కడా ఇసుక ర్యాంప్‌లు ప్రారంభం కాకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో ఇసుక అందడం లేదు.

ఇసుక బుకింగ్ ఒక ప్రహసనం

ఎక్కడైనా మిగిలిన కొద్దిపాటి ఇసుకకు ప్రభుత్వం ఆన్‌లైన్ బుకింగ్ పెట్టి దాన్ని ప్రహసనంగా మార్చింది. ఇసుక పోర్టల్‌లో బుకింగ్ చేసుకోవచ్చని చెప్పినా, దాని ద్వారా వారానికి ఒకసారి కూడా బుకింగ్ చేసుకోవడం కుదరడం లేదు. వారంలో ఎప్పుడో ఒకసారి అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఇసుక పోర్టల్‌లో బుకింగ్ ఓపెన్ చేస్తున్నారు. నిమిషాల్లోనే వారం రోజుల బుకింగ్‌లన్నీ అయిపోతున్నాయి. సాధారణ జనం ఎవరైనా దాని కోసం ప్రయత్నిస్తే నిద్ర లేకుండా ఎదురు చూడడం తప్ప ఉపయోగం ఉండడం లేదు. ఇక ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తున్నది ఎక్కడన్న ప్రశ్నకు జవాబు లేదు. గతంలో రూ.3 వేలకు దొరికే ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు రూ.5 వేలు పలుకుతోంది. మరోవైపు ఇసుక దొరక్కపోవడంతో పలు ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా పెరిగిపోయింది. నదులు, వాగుల నుంచి అక్రమంగా తవ్వి దాన్ని అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. రాజోలు నియోజకవర్గంలో ఇసుక దొరక్క పోవడంతో రావులపాలెం, గంటి, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కొందరు అక్రమార్కులు ఇసుకను రవాణా చేసి విక్రయిస్తున్నారు. రాజోలు, శివకోడు, రామరాజులంక నదీ సరిహద్దులోని ఇసుక పశ్చిమగోదావరి చేరి మరలా ఇటువైపు వస్తోంది. దీంతో ఇసుక యూనిట్ ధర రూ.4500 పలుకుతోంది.



నిలిచిపోయిన భవన నిర్మాణం

నిర్మాణాలన్నీ ఆగిపోతున్నాయి

ఇసుక అందుబాటులోకి తెచ్చి తమ ఉపాధి కాపాడాలని గృహనిర్మాణ కార్మికులు కోరుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఇసుక సంక్షోభం నెలకొంది. వెరసి నిర్మాణ రంగం స్తంభించిపోయింది. చిన్న, మధ్య తరహా నిర్మాణాలన్నీ నిలిచిపోయాయి. ఒక ట్రాక్టర్ ఇసుక దొరికినా సాగిపోయే పనులు కూడా ఆగిపోయాయి. చిన్న ఇళ్లు కట్టుకునే వాళ్లు కూడా ఇసుక దొరక్క నిర్మాణాలు ఆపేశారు. కనీసం చిన్నపాటి రిపేర్లు చేయించుకోవడానికి సైతం ఇసుక దొరక్క పనులు ఆగిపోయాయి. దీంతో దానిపై ఆధారపడి పని చేస్తున్న కార్మికులు సుమారు 5000 మంది ఒక్కసారిగా రోడ్డున పడ్డారు. రాజోలు నియోజకవర్గంలో బిల్డింగ్ పనులు చేసే స్థానిక కార్మికులు సుమారు 2000 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇసుక లేక నిర్మాణాలు నిలిచిపోవడంతో వందలాది మంది కార్మికుల ఉపాధికి విఘాతం ఏర్పడింది.

రాజోలు నియోజకవర్గంలో సోంపల్లి, రాజోలు, దిండి, రామరాజులంక, పెదలంక, సఖినేటిపల్లి లంకలో ఇసుక రీచ్‌లు నడిచేవి, అక్కడ స్థానికంగా ఉన్న బోట్స్ మ్యాన్ సొసైటీల ఆధ్వర్యాన నదిలో నుంచి ఇసుకను పడవలపై ఒడ్డుకు చేర్చి దాని నుండి ట్రాక్టర్‌కు ఎగుమతులు చేసే ప్రక్రియ గతం నుంచీ ఉంది. ప్రస్తుతం ఏర్పడిన ప్రభుత్వంలో రాజోలులో ఉన్న ఇసుక రీచ్‌లపై ఎలాంటి స్పష్టతా లేదు. కానీ ఇసుక ఒడ్డుకు చేర్చినందుకు బోట్స్ మ్యాన్ సొసైటీకి రూ.1200 ట్రాక్టర్ కిరాయి రూ.600 కేటాయిస్తే వినియోగదారులకు రూ.1800 ఇసుక దొరుకుతోంది. దీంతో ఇతర జిల్లాల నుంచి రూ.4500కు తెచ్చుకునే ఇసుక రూ.1800కే దొరకడంతో అటు వినియోగదారుడు ఇటు భవన నిర్మాణ కార్మికులకు లబ్ధి చేకూరుతుంది. వినియోగదారుడు వెహికిల్ తీసుకుని వస్తే బోట్స్‌మెన్ సొసైటీకి రూ.1200 చెల్లించి ట్రాక్టరు ఇసుక తీసుకుని వెళ్లవచ్చు. సొంత వెహికిల్ ఉన్న వాళ్లకు రూ.1200కే ట్రాక్టరు ఇసుక దొరుకుతుంది. ఈ దిశగా రాజోలులోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రయత్నం చేస్తే ఇసుక కొరత లేని నియోజకవర్గంగా రాజోలు నిలుస్తుంది.

పిఎసిఎస్‌ల బలోపేతానికి చర్యలు : జెసి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రాథమిక సహకార సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని జెసి టి.నిశాంతి అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు బహుళ ప్రయోజనకరంగా ఉన్నప్పుడే మరింత శక్తివంతంగా ఆర్థికంగా లాభదాయకంగా రూపాంతరం చెందగలవని ఆమె అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ, సంయుక్త వర్కింగ్ కమిటీ జిల్లాస్థాయి అమలు కమిటీల సమావేశం సభ్యులతో నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కంప్యూటరైజేషన్ ప్రక్రియ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సహకార సంఘాలలో ఇతర వ్యాపారాలు ఆయిన పెట్రోల్ బంకుల నిర్వహణ, జలజీవన్ మిషన్ కింద తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, జన ఔషధి కేంద్రాల నిర్వహణ, కామన్ సర్వీస్ కేంద్రాలు రైతుల కొరకు అమలు చేయాలన్నారు. ముమ్మిడివరంలో బహుళార్థ మల్టీపర్పస్ ప్రయోజన గోడౌను నిర్మాణాన్ని పూర్తి చేసి ఆ యొక్క వసతులు ఈ నెలాఖరు నాటికి అందుబాటులోకి తేవాలన్నారు. మత్స్య, పశు సంవర్ధక విభాగాల్లో మల్టీపర్పస్ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పాల ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు నూతనంగా మల్టీపర్పస్ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తూ వివిధ రంగాల ఆర్థిక ప్రగతికి చేయూతనివ్వాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆదాయ వనరులు పెరగడం తోపాటు పాడిపరిశ్రమ, చేపల పెంపకం, నిల్వ వంటి బహుళక ప్రయోజనకర కొత్త రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కంప్యూటరీకరణ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం కానున్నాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను నాబార్డుతో అనుసంధానం చేసి డిజిటలైజేషన్, సపోర్ట్ సిస్టమ్స్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేరును నాబార్డు రూపొందించిందన్నారు. దీనివల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సమర్థత ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. బ్యాంకుల ప్రాథమిక సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసే అక్రమాలకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో సంఘాలలో సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం జరుగుతోందన్నారు. సహకార సంఘాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ఆర్థిక చేయూత అందించాలన్నారు. ప్రాంతీయ అసమతుల్యతలను తొలగించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో సహకార అభివృద్ధిని వేగవంతం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, సభ్యులు నాబార్డ్ డిజిఎం స్వామి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, ఎడి మార్కెటింగ్ కె.విశాలాక్షి, డిసిసిబి సిఇఒ రామచంద్రరావు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయరెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిఇఒలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో సహకార అధికారులతో మాట్లాడుతున్న జెసి టి.నిశాంతి

విద్యుత్ సమస్యలపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - మండపేట

నియోజకవర్గానికి సంబంధించి విద్యుత్ సమస్యలపై డిఇ, ఎడిఇ, ఎఇలతో గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 43 గ్రామాలకు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోపు 24 గంటల విద్యుత్ ఒధించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ఎంఎల్ఎకు తెలిపారు. ఇప్పటికే కొన్ని గ్రామాలకు 24 గంటలు కరెంట్ అందిస్తున్నామన్నారు. అదేవిధంగా జనవరి నాటికి నియోజకవర్గంలో ఎక్కడా లోఓల్టేజ్ సమస్యలు లేకుండా కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేయాలని అధికారులకు ఎంఎల్ఎ సూచించారు. అనంతరం పలు కరెంట్ సమస్యలపై అధికారులతో చర్చించారు. తొలుత ఎంఎల్ఎ వేగుళ్ల రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు ఆయనను పూలమాలతో, దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఇ రత్నాలరావు, ఎడిఇలు మురళీమోహన్, శ్రీధర్, ఎఇలు ముని, రవికుమార్, సాంబశివరావు, ఈశ్వరరావు, సురేష్, సబ్ ఇంజినీర్లు, తదితర్లు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ వేగుళ్ల ను సత్కరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - అమలాపురం

అంబే ద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కార్యాలయంలో ఈనెల 13న శుక్రవా రం నిర్వహించ తలపెట్టిన ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సమావేశం వాయిదా వేశామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి.జ్యోతిలక్ష్మి దేవి గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు విజయ వాడ ఇందిరాగాంధీ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రగతికి మూలమైన స్వర్ణాంధ్ర ఎ-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నందున ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సమావేశాన్ని వాయిదా వేశామని ఆమె తెలిపారు. మరలా ఈ సమావేశం ఎప్పుడు నిర్వహించేది తదుపరి తెలియజేస్తామని ఆమె విజ్ఞప్తి చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిల్లి సూర్యప్రకాష్

రైతు సమస్యలపై నేడు 'చలో అమలాపురం'

ప్రజాశక్తి - రామచంద్రాపురం

రైతు సమస్యలు పరిష్కారం కోసం వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం చలో అమలాపురం పిలుపునిచ్చామని వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణం నుంచి అమలాపురం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. రైతులకు అండగా ఉంటానని రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసన గళం చేపట్టామన్నారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ. 20 వేలు ఇవ్వాలకని, సూపర్ సిక్స్ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, ధాన్యానికి కనీసం మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను తొలగించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలని, రైతుపై అదనపు భారం మోపే చర్యలను విరమించుకోవాలని ఈ సందర్భంగా పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. అనంతరం వైసిపి ప్రతినిధులతో కలిసి చలో అమలాపురం పోస్టర్ ఆవిష్కరించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - అమలాపురం

సమస్యలను పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ సిబ్బంది గురువారం సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బందికి వేతనం రూ.29,200, నుంచి రూ.24,500 అందివ్వాలన్నారు. 15 ఏళ్ల సర్వీసు ఉన్నవారిని రెగ్యులర్ చేయాలన్నారు. వారాంత, పండుగ సెలవులు, ఇఎల్‌లు ఇవ్వాలన్నారు. లేదా ఆరోజులకు సంబంధించి వేతనాలు ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికునికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5లక్షలు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేడిద దుర్గఅర్జునరావు, జిల్లా అధ్యక్షులు చిక్కాల వెంకటతిరుమలకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహారాజు మధుసూదనరావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగవరపు శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మట్టపర్తి ఆనందరాజు, కార్యదర్శులు దంగేటి రామకష్ణ ప్రసాద్, దంగేటి షణ్ముఖరావు సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

పర్యాటక కేంద్రంగా లొల్ల లాకులు

ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భవిష్యత్తులో లొల్ల లాకులను మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. ఆ స్ఫూర్తితో ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు రాష్ట్ర పండుగలా నిర్వహిస్తామని అన్నారు. లొల్ల లాకుల వద్ద గురువారం పలు ప్రభుత్వ శాఖలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంటుందని గుర్తుచేశారు. కానీ సంక్రాంతి కంటే ముందే లొల్ల లాకుల వద్ద పండుగ వాతావరణం నెలకొనేలా గోదావరి ట్రోఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. అందరి సహకారంతో ఈ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రంగవల్లుల పోటీలు, ఈత పోటీలు, పడవల పోటీలు, గాలి పతంగుల పోటీలు మొదలగునవి నిర్వహిస్తారన్నారు. కేరళ స్థాయిలో పడవ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహిస్తామని బయటి ప్రాంతాల నుండి వచ్చే వారికి స్థానికులకు పూర్తి స్థాయిలో పండుగ వాతావరణం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పర్యాటకు లను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు



సచివాలయం సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపిడిఒ

కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి - అల్లవరం

ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల సచివాలయం సిబ్బంది కి ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 లక్ష్యాలు సాధనకు కృషి చేయాలన్నారు. సచివాలయం సిబ్బంది హౌస్ హోల్డ్ ఇమేజ్ క్యాప్చర్ సర్వే, ఎన్‌పిసిఐ లింకింగ్, మిస్సింగ్ ఫ్యామిలీ మెంబెర్స్ చేర్పు వంటి వాటిలో 100 శాతం సాధించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి వ్యక్తి ఏదో ఒక హౌస్ హోల్డ్‌లో మ్యాప్ అయ్యి ఉండాలని, బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీసు అక్కౌంట్ ఎన్‌పిసిఐ లింక్ అవ్వాలన్నారు. వివిధ శాఖల ద్వారా పుష్ అయిన వ్యక్తుల వివరాలు సంబధిత శాఖ ఫంక్షినరీ లాగిన్‌లో హౌస్ హోల్డ్‌కు మ్యాప్ చేయాలని ఆదేశించారు. బాల్య వివాహం నివారించడంలో పాల్గొన్న అల్లవరం సచివాలయం సిబ్బందిను అభినందించారు. ఈ సమావేశంలో కార్యదర్శులు రాజ్ మోహన్, సాయి బాబు, వీర బాబు, మల్లాయమ్మ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అమలాపురం ఎంపిడిఒ బాబ్జి రాజు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని నిర్మాణంలో ఉన్న పలు సిసి రోడ్లను తనిఖీ చేశారు. పల్లె పండుగలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా అమలాపురం మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన వన్నె చింతలపూడి, కామనగరువు గ్రామాలలోని సిసి రోడ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. సిసి రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.



సిసి రోడ్ల నిర్మాణ పనులు తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ


'శ్రీనివాస'లో డ్రోన్ పైలెట్ల శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాసా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో అకిన్ అనలిటిక్స్ సంస్థ డ్రోన్ పైలెట్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించింది. భద్రత, అర్హతా ప్రమాణాల్ని తనిఖీ చేసెందుకు ఢిల్లీ నుంచి డైరక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ బృందం విచ్చేసింది. కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రంలో మౌలిక సదుపాయాలు, సాంకేతిక నిర్వహణ వంటి అంశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన సమావేశంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న దశలో డ్రోన్ ఆవశ్యకత అన్ని రంగాల్లో పెరిగిందన్నారు. ముఖ్యంగా వ్యవసాయరంగంలో పంటకు ఎరువులు, పురుగు మందులు వంటివి పిచికారీ చేయ డానికి ఉపయోగపడు తున్నాయన్నారు. ప్రిన్సిపల్, సభాధ్యక్షులు డాక్టర్ ఎం.శ్రీనివాస కుమార్ డ్రోన్ ఆవశ్యక తను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ సభ్యులు సందీప్, వివిధ విభా గాల డీన్స్ అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీనివాస కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రోన్ శిక్షణా కేంద్రం




అభినందిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు

ఆన్‌లైన్ పరీక్షలో 'నేతాజీ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల ఇంటర్నేషనల్ స్థాయిలో జరిగిన గీతా ఆన్లైన్ టెస్ట్‌ల్లో నేతాజీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ తుమ్మా శ్రీనివాసరావు తెలిపారు. విజేతలుగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులైన కర్రా లక్ష్మీ దుర్గ, కె.సుభాష్ లను ఆయన ఆధ్వర్యంలో గురువారం స్కూల్లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో భారత్ టాలెంట్స్, అను స్వచ్ఛంద సంస్థ స్థానిక గీత సమాజం ఆధ్వర్యంలో యువజన అవార్డు గ్రహీత, లండన్ ఫిజియో థెరపిస్ట్ మోదిత్ ముఖ్య అతిథిగా సీతల కళ్యాణ శతసేవా వేడుకల్లో భాగంగా ఈ టాలెంట్ టెస్ట్ ర్యాలీలో నిర్వహించారన్నారు.

కార్టూ'నిజం'



కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - మామిడికుదురు

గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు కోరారు. నగరం లో నగరంలో గురువారం జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించా లన్నారు. ఎఐసిసి, పిసిసి నియోజకవర్గ కో ఆర్డి నేటర్లతో సమావేశం నిర్వహించి జిల్లా కమిటీ నిర్మాణం, అనుబంధ కమిటీ మండల కమిటీల నిర్మాణం గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరి శ్రీను, అయితాబత్తుల సుభాషిణి, మహమ్మద్ అరిఫ్, మాచవరపు శివన్నారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, బొంతు రాజేంద్రప్రసాద్, ముషిని రామకృష్ణ ,చీకట్ల అబ్బాయ్, నీతిపూడి బాల సత్యనారాయణ, ఉదయ బాస్కర్ రావు, దొరబాబు, కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేటర్ల సమావేశంలో డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

నీటి సంఘం ఎన్నికలపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి - ఆలమూరు

నీటి సంఘం ఎన్నికలపై మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంపిడిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 14న జరగబోయే నీటి సంఘం ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో నాలుగు నీటి సంఘాలకు, ఒక డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌కు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో మడికి, చొప్పెల్ల, ఆలమూరు, చింతలూరు నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఆలమూరు నీటి సంఘానికి బొబ్బ జయశ్రీ గర్ల్స్ హై స్కూల్, చొప్పెల్ల నీటి సంఘానికి చెముడు లంక జడ్‌పి హైస్కూల్, మడికి నీటి సంఘానికి నేతాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, చింతలూరు నీటి సంఘానికి కొత్తూరు గవర్నమెంట్ హైస్కూల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ పి.పద్మ, రావులపాలెం వ్యవసాయ అధికారి బి.మీన, రావులపాలెం మండల పరిషత్ ఎఒ మంగతాయారు, ఇరిగేషన్ ఎఒ కృష్ణ త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు



దాడిపై ఫిర్యాదు చేస్తున్న కోనపాపపేట గ్రామస్తులు

దాడి చేశారంటూ బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తమపై జనసేన నాయకులు దాడి చేశారని గురువారం కోనపాపపేట గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్ర తీరంలో వేసిన పైప్‌లైన్లు తొలగించాలని మత్స్యకారులంతా ఆందోళన చేస్తున్నామని, అయితే కొందరు జనసేన నాయకులు అరబిందో యాజమాన్యంతో కుమ్మక్కై డబ్బులు తీసుకున్నారని, ఇదే అంశంపై గురువారం గ్రామంలోని రామాలయం వద్ద గురువారం ఉదయం చొక్కా పేతురు, చొక్కా ప్రకాష్‌లు జనసేన పార్టీకి చెందిన నాయకులు పల్లేటి బాపన్న దొర, నాగేశ్వరరావు, శ్రీను, దారకొండ, రాజు, మరికొందరు నిలదీశారని అన్నారు. దీంతో వారు తమపై దాడి చేసి గాయపర్చారని, బాధితులను కాకినాడ తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. జనసేన నాయకులు గుండాలుగా ప్రవర్తిస్తున్నారని, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ బాధితులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీనివాస్

దాడి కేసులో ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులపై దాడికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ రాత్రి 11.30గంటల సమయంలో ఇద్దరి వ్యక్తులు మద్యం తాగి వసతి గృహంలో చొరబడ్డారు. 8, 9, 10 తరగతి చదివే విద్యార్థులు గదుల్లోకి వెళ్ళి వారిని భయభ్రంతులకు గురి చేసి, బీరు బాటిళ్లు పగలగొట్టి వారిని చంపుతానని బెదిరించి రూ.540 లాక్కునిపోయారన్నారు. విషయం తెలుసుకున్న వార్డెన్ వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. తమ విచారణలో రథాలపేటకు చెందిన గంగాధర్, కుమారపురానికి చెందిన దయానంద్ ఈ దాడికి పాల్పడ్డారని, వారిద్దరని అరెస్టు చేసినట్లు తెలిపారు. అవసరమైతే అటువంటి వ్యక్తులను అరెస్టు చేసి రౌడీషీట్లు తెరుస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

ప్రజాశక్తి - శంఖవరం

మద్యం తాగి వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు జైలు శిక్ష పడినట్లు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ప్రత్తిపాడు వైపు నుంచి అన్నవరం వస్తున్న లారీని ఆపి డ్రైవర్‌ను బ్రీతింగ్ ఎనలైజర్‌తో తనిఖీ చేశారు. మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో ప్రత్తిపాడు కోర్టులో డ్రైవర్‌ను హాజరు పరిచగా న్యాయమూర్తి 15 రోజులు జైలు శిక్ష విధించారని తెలిపారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకలు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- గోకవరం

పురుగుల మందు తాగి వ్యక్తి మతి చెందిన సంఘటన గోకవరంలో చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం మండల కేంద్రమైన గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన కాళ్ల మల్లి రాజు (30) కుటుంబ కలహాల కారణంగా గురువారం తెల్లవారుజామున తన ఇంటి వద్ద ఉన్న పురుగు మందు తాగాడన్నారు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని రిఫర్ చేశారన్నారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి ప్రైవేటు వాహనంలో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడాన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆగ్రహించి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మల్లి రాజు మతి చెందాడని ఆసుపత్రి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి ఆసుపత్రికి వచ్చి పోలీసులతో చర్చించారు. మృతుని చావుకి కారణమైన పరిస్థితులను సిసి ఫుటేజ్ ద్వారా తెలుసుకొని దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

యానాం వార్తలు



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పేదలకు నష్టపరిహారం చెల్లించాల్సిందే...

ప్రజాశక్తి - యానాం

రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థల నుంచి మత్స్యకారులకు ఇస్తున్న పరిహారం మాదిరిగా అర్హులైన అన్ని వర్గాల పేద ప్రజలకు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ నాయకులు ముఊగపాటి ప్రసాద రాజు, దున్నా చక్రవర్తి, చీకట్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చమురు సంస్థల వల్ల అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగినప్పటికీ ఎటువంటి పరిహారం చెల్లించడం లేదన్నారు. ఎస్సి భూములలో చమురు సంస్థల పనులు చేపట్టిన నామమాత్రంగా నష్ట పరిహారం చెల్లించడం తప్ప ఏ ఒక్క ఎస్సి రైతుకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించడం లేదన్నారు. గ్రామ అభివృద్ధికి గానీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు గాని అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్న నాయకులు సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 5229 మంది మత్స్యకారులకు మాత్రమే పరిహారం చెల్లిస్తున్నారని అన్నారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, 643 డ్వాక్రా గ్రూపులకు కుట్టు మిషన్లు, గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. పారిశుధ్యకార్మికులకు డ్రెస్ కోడ్, మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఆయా సంస్థలే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

చదరంగం న్యాయ నిర్ణేతల పరీక్షల్లో ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

రాజమహేంద్రవరంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సీనియర్ నేషనల్ చదరంగం న్యాయ నిర్ణేతలు పరీక్షల్లో యానాం ప్రాంతానికి చెందిన ఒబిలి తేజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సుమారు 73 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కాగా అందులో 21 మంది ఉత్తీర్ణులు అయ్యారు. పుదుచ్చేరి స్థాయిలో యానాం నుంచి పాల్గొని 4వ స్థానంలో నిలిచారు. పరీక్షలో ప్రతిభ చాటిన తేజని యానాం పెద్దిరెడ్డి కాలనీకి చెందిన గ్రామస్తులు అభినందించారు.



అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు

బాధితులకు రూ.5 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

ఫెంగల్ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు పుదుచ్చేరి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు గురువారం యానాం నియోజకవర్గంలో (ఎపిఎల్, బిపిఎల్) ప్రతి రేషన్ కార్డు దారులకు రూ.5 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ కాకపోతే ఎంఎల్ఎ కార్యాలయాన్ని గాని, సంబంధిత అధికారులను గాని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా యానాం ప్రజల తరపున కూటమి ప్రభుత్వ నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పలువురి కుటుంబాలకు మల్లాడి పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలంలో మృతి చెందిన, ఇతర సమస్యలతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం పరామర్శించారు. స్థానిక కనకాల పేటలో అనారోగ్యంతో మృతి చెందిన ఐఆర్ బి కానిస్టేబుల్ కనకాల లోవరాజు మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కోన వెంకన్నబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన కనకాల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను మల్లాడి పరామర్శించారు.

వికలాంగురాలిపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి -కరప

కరప మండలం వేములవాడలో మానసిక వికలాంగురాలిపై అత్యాచార యత్నం జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కరప ఎస్ఐ సునీత తెలిపిన వివరాల మేరకు వేములవాడకు చెందిన మహిళకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె మానసిక వికలాంగురాలు. ఆమె భర్త ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఆమె కేటరింగ్ పని చేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఈనెల 11వ తేదీ సాయంత్రం ఆమె కేటరింగ్ పనికి వెళ్లింది. రాత్రి 9 గంటల సమయంలో ఆమె కుమారుడు అదేగ్రామంలో ఉంటున్న పిన్ని ఇంటికి బయలుదేరాడు. ఈ సమయంలో గ్రామానికి చెందిన మట్టపర్తి వీరబాబు అతన్ని ఆపి సినిమాకు వెళ్దాం అని అడిగాడు. తన అక్క ఒక్కర్తే ఇంట్లో ఉందని, పిన్ని పిలుచుకురావడానికి వెళ్తున్నాని చెప్పాడు. అనంతరం కొంత సేపటికి పిన్నితో కలిసి ఇంటికి వచ్చాడు. తలుపులు వేసి ఉండటంతో గట్టిగా కొట్టారు. వీరబాబు తలుపులు తీసి అక్కడ నుండి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో ప్రభుత్వానికి అన్ని విధాల సహకరించాలని జెసి టి.నిషాంతి మిల్లర్లను కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లాలోని మిల్లర్ల యజమాన్యాలతో సమావేశం నిర్వహించి గోనెసంచులు సరఫరా, హమాలీల అందుబాటు, మిల్లుల వద్ద ధాన్యం అన్లోడింగ్‌లో జాప్యాలు, కనీస గిట్టుబాటు ధరల కల్పన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లర్లు రైతాంగానికి మంచి నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయాలని సూచించారు. ధాన్యం లోడుతో మిల్లులకు చేరే వాహనాలు అన్లోడింగ్ లో జాప్యాలు వివరించాలన్నారు. హమాలీలను వంతుల వారీగా 24/7 నియమించుకోవాలని సూచించారు. అన్లోడింగ్‌లో జాప్యాలకు పాల్పడే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యానికి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఇప్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుండి ఫిర్యాదులు మిల్లర్లపై వస్తే సహించేది లేదని ఆమె మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ ధాన్యం యొక్క తేమ శాతాన్ని కొంతమేర సడలించామన్నారు. తేమ శాతం రైతు సేవా కేంద్రంలో నమోదు కాబడిందే ఫైనల్ అని ఆమె స్పష్టం చేశారు. తేమ శాతం పేరున మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి తరుగులు ధాన్యం కొనుగోలు సందర్భంలో రైతులకు విధించరాదని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గ దర్శకాలను మిల్లర్లు తప్పనిసరిగా ఆచరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. సిఎంఆర్ బియ్యం డెలివరీ గొడౌన్ల వద్ద జాప్యాన్ని నిలువరించాలన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై ఎంఎల్ఎ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ప్రజాశక్తి - తాళ్లరేవు

త్వరలో జరగనున్న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలపై ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండలంలోని ఆయా సంఘాల పరిధిలోని రైతులు, కూటమి నాయకులతో జరిగిన సమావేశంలో పలు సంఘాలకు ఆయా అభ్యర్థులను ప్రతిపాదించారు. నీలపల్లి నీటి సంఘం జనసేనకు కేటాయించారు. ఈ మేరకు ఇంజరం నీటి సంఘం అధ్యక్షునిగా వేగేశ్న భాస్కర రాజును ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. లచ్చిపాలెం నీటి సంఘానికి సంబంధించి నీటి సంఘం మాజీ అధ్యక్షుల కాల గణతి, దొరని వెంకట రెడ్డి పోటీ పడగా ఈ దఫా వెంకటరెడ్డికి అవకాశం కల్పిస్తున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. నీలపల్లి నీటి సంఘానికి సంబంధించి ధూళిపూడి గోవిందరావు పేరును జనసేనతోపాటు పలువురు రైతులు ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. కోరంగికి సంబంధించి సాయిరాజు ప్రెసిడెంట్‌గా యేరుపల్లి వీర్రెన్న వైస్ ప్రెసిడెంట్‌గా ప్రతిపాదించారు. గతంలో కోరంగి నీటి సంఘం అధ్యక్షునిగా పని చేసిన పెసింగి ఈశ్వరరావు తనకు మరోసారి అవకాశం కల్పించాలని తన మద్దతు దారులతో కోరగా, రాబోయే రోజుల్లో అవకాశం ఇస్తానని ఎంఎల్ఎ స్పష్టం చేశారు. పోలేకుర్రు నీటి సంఘం అధ్యక్షునిగా అల్లూరి రామకృష్ణంరాజును ఏకగ్రీవంగా రైతులు ప్రతిపాదించారు. పి.మల్లవరం అధ్యక్షులుగా ఉంగరాల కృష్ణ, మొగలతుర్తి బ్రహ్మం పోటీ పడుతుండగా ఈ చర్చను వాయిదా వేశారు. జగన్నాధగిరి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న మండలంలోని పటవల నీటి సంఘానికి సంబంధించి పటవల టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు భజన సత్తిబాబు, అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు కొత్తూరు కాశీ ఈశ్వరుడు పోటీ పడడంతో ఈ ఎన్నిక రసవత్తరం అయింది. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ డిసి ఛైర్మన్ పదవి రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండల పరిధిలో ఉండడం వల్ల మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. పటవల నీటి సంఘం అధ్యక్షుడు ప్రతిపాదన వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎంఎల్ఎ పొన్నాడ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు



నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ పొన్నాడ

మండలంలో పలువురు నాయకులను మాజీ ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురు వారం పరామర్శించారు. మాతృవియోగంతో బాధ పడుతున్న మండల వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎంపిటిసి సభ్యులు పోతుల రత్నకుమారి, నాయకులు పెసింగి వర్మ, చినబొడ్డుకి చెందిన నూకరాజు, పాతకోరంగి ఎస్ఎంసి ఛైర్మన్ లోవరాజు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కాట్రేనికోన జడ్‌పిటిసి నేల కిషోర్, మండల పార్టీ అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, అంకాడి అంజిబాబు, కొపనాతి నాగరాజు, సర్పంచులు పెయ్యల మంగే ష్, వెంటపల్లి నూకరాజు, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్, నాయకులు దున్నా శ్రీకాంత్, కాశి లక్ష్మణ స్వామి, దడాల జగదీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

50 వసంతాల సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, ప్రజలు

ఈ నెల 14, 15 తేదీలలో హైదరాబాదులో జరిగే అరుణోదయ సాంసకృతిక సమాఖ్య 50 వసంతాల సభను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక 1వ వార్డు పరిధి దమ్ముపేటలో దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వీరాంజనేయులు మాట్లాడుతూ అరుణో దయ సాంస్కృతీ సమాఖ్య చరిత్రను వివరించారు. ప్రజా ఉద్యమాలలో అరుణోదయ పాత్రను, సమాజంలో తీసుకువచ్చిన చైతన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ నాయకులు దేశెట్టి సురేష్, దుంగపల్లి సూర్యనారాయణ, కోట వీరబాబు, పిల్లి దుర్గ, వెంకయ్యమ్మ, అప్పల నరసమ్మ, కుమారి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - పిఠాపురం



లోగోను ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

నియోజకవర్గంలోని జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని నరసింగపురం రోడ్డులో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ పిఠాపురం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వర్మ, మర్రెడ్డి శ్రీనివాస్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం జర్నలిస్టులు ఎంతో శ్రమిస్తుంటారన్నారు. నిత్యం కుటుంబాలను కూడా వదిలి విధి నిర్వహణలో ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా నిలిస్తారన్నారు. విపత్కర పరిస్థితుల్లో సైతం వార్తల సేకరణకు ఎంతో శ్రమిస్తారన్నారు. అటువంటి వారికి స్థానికంగా ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి వంగా గీత, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే ట్రస్ట్ ఏర్పాటు : ముదునూరి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



సభలో మాట్లాడుతున్న ముదునూరి

నియోజకవర్గంలో నిరుపేదల కోసమే ముదునూరి మురళీకృష్ణంరాజు చారిట్రబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకష్ణంరాజు అన్నారు. నియోజకవర్గంలో పేదలను, పేద విద్యార్థులను ట్రస్టు తరుపున ఆదుకుంటామన్నారు. ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ఈ ట్రస్టును గురువారం చిన్న జీయర్‌స్వామి ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముదునూరి ట్రస్ట్ ముందుండాలన్నారు. కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, కర్రి పాపారాయుడు, బొల్లు నాగేశ్వరరావు, మాగాపు శివ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం మీసేవ కేంద్రాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - పెదపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ

మీ సేవ కేంద్రాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మీసేవ కేంద్రాల నిర్వహకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ సేవ కేంద్రాలు గత ప్రభుత్వంలో వినియోగించిన ఐ సెక్యూరిటీ ఫారాలు ఉపయోగించకూడదన్నారు. మీసేవ నిర్వాహకులు ఆ ఫారాలు ఒకసారి పున్ణపరిశీలించుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హిజ్రాలకు నూతన దుస్తులు అందజేస్తున్న పాస్టర్లు

ఘనంగా క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - కరప

మండలంలోని గొర్రిపూడి గ్రామంలోని జీసస్ ప్రేయర్ టవర్ చర్చ్‌లో హిజ్రాలు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమానికి చర్చి అధ్యక్షులు రెవరెండ్ జి. జాన్ ప్రసాద్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ జాన్ ప్రసాద్ హిజ్రాలకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కటకంశెట్టి ప్రభాకర్, పెంకే శ్రీనివాస్‌బాబా, యంగ్ మైండ్ వ్యవస్థాపకులు వాకాడ వెంకటరమణ, జనసేన మహిళా నాయకురాలు బట్టు లీల పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు పిఠాపురం యువకుడు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణానికి చెంది న పి.కృష్ణ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక అయ్యినట్లు కోచ్ పి.లక్ష్మణ రావు గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. రాజమహేం ద్రవరంలోని నన్నయ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీలలో సిబిఆర్ కాలేజీలో చదువుతున్న కృష్ణ ఇండియన్ రౌండ్ వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్లో రజిత పథకం సాధించారన్నారు. ఈనెల 24 నుంచి 27 వరకూ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటాడు..

గద్దర్ పురస్కారం అందుకున్న యేసురత్నం

ప్రజాశక్తి - గండేపల్లి

గద్దర్ జాతీయ జీవిత సాఫల్య పురస్కారాన్ని రత్నం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మండలంలోని మురారికి చెందిన దార యేసురత్నం అందుకున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గన్నవరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి వెన్నెల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. బడుగు బలహీన వర్గాల కోసం వారు చేస్తున్న కృషికి ఈ అవార్డును అందించారు. మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకులు కోరుకొండ జాన్, శ్రీశ్రీ కళావేదిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు బివివి.సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి, జడ్‌పిటిసి సభ్యులు ప్రసన్నకుమార్, ఎంఎంసి మాజీ ఛైర్మన్ అరిగెల బలరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, తాళ్ళరేవు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయునది ఏమనగా, తాళ్ళరేవు మండలం, తాళ్ళరేవు గ్రామ పంచాయితీ ఏరియాలోని సర్వే నెంబర్ : 363-1, నందు సుమారు ఎ 1.00 సెంట్లును కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారి పూర్వానుమతి లేకుండా పంచాయితీ కి 10% సామాజిక స్థలం వదిలి పెట్టకుండా, పంచాయితీ కి మరియు ప్రభుత్వము వారికి చెల్లించవలసిన లే-అవుట్ ఫీజులు వగైరాలు చెల్లించకుండా మరియు ప్రాధమిక సౌకర్యాలు అయిన రోడ్‌లు, డ్రెయిన్‌లు, విద్యుత్ వగైరాలు ఏర్పాటు చేయకుండా ఏ విధమైన నియమ నిబంధనలు పాటించకుండా అనధికారికంగా ఇండ్ల స్థలములుగా విభజించి అమ్మకములు చేయుట మరియు కొనుగోలు చేయుట చట్ట ప్రకారము నేరమైయున్నవి. ఇది పూర్తిగా అనధికార లే-అవుట్ అయి ఉన్నది. కావున అటువంటి స్థలముల యందు భవన నిర్మాణములు చేసుకొనుటకు తాళ్ళరేవు గ్రామ పంచాయితీ నుండి ఏ విధమైన అనుమతులు మంజూరు చేయబడవనియు మరియు అనధికారకంగా ఇండ్ల స్థలములుగా విభజించుచున్న సంబందిత వ్యక్తుల పైన మరియు అనధికార కట్టడముల నిర్మాణము చేయువారి పైన చట్టపరమైన క్రిమినల్ చర్యలు చేపట్టి అందులకు అయ్యే నష్టం బాద్యుల నుండి రాబట్టు బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సం/- **పంచాయితీ కార్యదర్శి**

తేది: 11-12-2024 గ్రామ పంచాయితీ - తాళ్ళరేవు